

ఇలాంటి కళ్యాణీమణులకి కనువిప్పు కలిగించే కథ!

# ఆమెలో మార్పు వచ్చిందా?

## గంటి భానుమతి

అద్దం ముందు నుంచుని, అటూ ఇటూ తల తిప్పుతూ, ముందుకి వెనక్కి తిరుగుతూ, నడుస్తూ, తన ప్రతిబింబాన్ని మరోసారి ఆఖరుసారిగా చూసుకుని, సంతృప్తిగా రెండడుగులు వేసి మంచం మీద ఎదురుచూస్తున్న బంగారు రంగులో మెరుస్తున్న పర్సుని చేతిలోకి తీసుకుని వాచి చూసుకుంటున్న కళ్యాణి, చిన్నగా ఉలిక్కిపడింది.

'లేటయ్యానా ఏమిటీ?' అని అనుకుంటూ ముందు గదిలోకి వచ్చి "శశాంక్! రెడీ..వెళ్దాం.." అంది కళ్యాణి.

శశాంక్ కనపళ్ళేదు. జవాబు రాలేదు. మరో రెండుసార్లు పిలిచింది.

ఏ విధమైన స్పందన రాలేదు. 'ఎక్కడికెళ్ళాడు' అని తనలో తాను అనుకుంటూ మళ్ళీ ముందుగదిలోకి వచ్చింది.

ఎక్కడా శశాంక్ కనపళ్ళేదు కానీ, సోఫాల మధ్య ఉన్న నల్లటి గాజు టీపాయ్ మీద గులాబి రంగు కవరు కనపడింది.

"ఏంటబ్బా ఇది!" అని దాన్ని చేతిలోకి తీసుకుంది. దానిమీద 'కళ్యాణికి' అని రాసి ఉంది.

ఈ కవరు వాడాడెందుకు? అది తమ యింట్లోని కవరే. పెళ్ళిళ్ళకి, ఫంక్షన్లకి, అందులో కాష్ పెట్టి కానుకగా యిచ్చే కవర్ అది. దానికి ఓ వైపున విత్ బెస్ట్ కాంప్లిమెంట్స్ ఫ్రం శశాంక్ అండ్ కళ్యాణి అని ప్రింట్ చేసి ఉంటుంది.

ఆశ్చర్యంగా కవరు తెరిచి, అందులో ఉన్న కాయితం తీసింది. ఇంకా ఆశ్చర్యపోయింది. ఈ కాయితమా! దీనిమీద రాయాల్సిన అవసరం ఏం వచ్చింది? అది అర్జంట్ మెసేజ్‌లు రాసుకునే కాయితాలున్న ప్యాడ్‌లోంచి చింపిన కాయితం అది. అంత అవసరం ఏమొచ్చింది. చదవడం మొదలెట్టింది.

"డియర్ కళ్యాణి,

నువ్వు యింక మారవు. నీలో యింక మార్పు రాదు. ఎప్పటికప్పుడే నువ్వు మారుతావు మారుతావు అని ఎదురుచూసాను. కానీ...నేను కోరుకున్న మార్పు రాలేదు. అలాగే..ఈ పధ్నాలుగేళ్ళు కూడా..యిలాగే యిలా వెయిటింగ్‌లోనే గడిచిపోయాయి. ఇంక నావల్ల కాదు. ఈ వెయిటింగ్ యింక చేయలేను. వెయిట్ చేయడం కూడా వేస్టే. ఇంక లాభం లేదు. నేను వెళ్తున్నాను"

షాక్..చేతి వేళ్ళల్లో స్పర్శ పోయినట్లుగా కాయితం కింద పడిపోయింది. మరుక్షణం ఆమె మనసు పిచ్చిగా, అర్థం లేకుండా, దిక్కుతోచనట్లుగా అటూ ఇటూ పరిగెత్తింది.

కిందపడ్డ కాయితం చివరలు ఆమెలాగే వొణికిపోతున్నాయి.

నేను వెళ్తున్నాను...అంటే వెళ్ళిపోయాడా? ఎక్కడికి? ఎందుకు? ఏం జరిగిందని వెళ్ళిపోయాడు? అది కూడా యిన్ని ఏళ్ళ తర్వాత. ఇప్పుడా!

పెళ్ళయిన ఈ పధ్నాలుగేళ్ళలో వాదోపవాదాలు ఉన్నా, పెద్దగా లెక్కలోనికి రాదు. నెగ్లిజిబుల్. ఘర్షణలు, సంఘర్షణలు లేవు. దూరాన్ని పెంచేంతటి సంక్షోభాలు లేవు.

పెళ్ళయిన కొత్తలో వచ్చిన కడుపు గురించి, అనుకూలంగా ప్రతికూలంగా అభిప్రాయ భేదాలు వచ్చినా, శశాంక్ సీరియస్‌గా తీసుకోలేదే! మరి అలాంటిది ఈరోజున వెళ్ళిపోయేంతటి ఘటన ఏం జరిగింది?

అస్తిత్వం పోతోంది, నడ్డివిరిచేస్తున్నారంటూ, బాస్‌మీద కోపం వచ్చి ఉద్యోగం మానేస్తే శశాంక్ ఏమనలేదు.

ఇంట్లోనే కేకులు తయారుచెయ్యడం, ఆర్డర్లమీద కేకులు చేసి యివ్వడం, ఇంట్లోనే ఓ గదిలో బొటిక్ పెట్టడంతో యింటినిండా మనుషులు. తన యింట్లో తనే పరాయివాడిగా అటూ ఇటూ తప్పుకుంటూ తిరిగిన రోజుల్లో ప్రతిఘటించలేదు. వ్యక్తిత్వ వికాసంమీద క్లాసులు, యింట్లో సాగుతున్న బిజినెస్ కోసం ఓ మంచి ఏరియాలో చిన్న ఫ్లాటు తీసుకున్న రోజున ఓ మొగుడిలాగా అడ్డుపెట్టలేదు.

డెలివరీ అయ్యాక, చంటివాడితో ఉంటూనే తన బిజినెస్ అభివృద్ధి చేసుకుంది. అలాంటప్పుడు కూడా ఆరోగ్యం చూసుకోకుండా ఏవిటి బిజినెస్ అని ముద్దుగా మందలించాడే..అది అబద్ధమా! ఆ ప్రేమ నిజంకాదా?

రెండేళ్ళ కొడుకుని అమ్మ దగ్గర ఉంచేసినప్పుడు, ఎందుకలా చేసావ్! అని ప్రశ్నించలేదే..అది తనపట్ల ఉదాసీనతా!

మూడో క్లాసులోకి వచ్చిన బాబును మంచి రెసిడెన్షియల్ స్కూల్లో వేసిన రోజున అంతా నీ యిష్టమేనా! వాడికి నేనేం కానా! అని అనలేదే! అలాంటిది ఇప్పుడింత అసహనం ఎక్కడి నించొచ్చింది.

పది నిమిషాల్లో గబగబా పంచకళ్యాణిలా, చకచకా తయారయ్యే కళ్యాణి, అలంకరణలో మార్పొచ్చింది. డ్రెస్ చేసుకోవడంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటోంది. చాలా సమయం కూడా తీసుకుంటోంది.

"నేను పదిమందికి క్లాసులు తీసుకుంటాను. పదిమంది ఆడవాళ్ళ మధ్య మసిలే బిజినెస్ నాది. నేనున్న వాతావరణం అలాంటిది. నాకోసం నేను అన్నం తింటున్నా, నా ప్రొఫెషన్ కోసం నేను పర్‌ఫెక్ట్‌గా తయారవ్వాలి"

డ్రెస్ చేసుకోడం గురించి, అంతంత టైము తీసుకోడం గురించి ఓసారి శశాంక్ అంటే కళ్యాణి యిచ్చిన జవాబు అది. ఆ జవాబు విని శశాంక్ నవ్వాడేకానీ, ఆ నవ్వు వెనకాల యింత అయిష్టత ఉందని తెలీదు. పైగా ఏనాడూ వ్యక్తపరచని శశాంక్, ఈరోజున..ఇలా..!

సాధారణంగా రాత్రి ఫోన్ చేసి చపాతీలు కూర, బయటి నుంచి తెప్పిస్తే ఏమీ అనకుండా తినేవాడు.

"కళ్యాణీ మధ్యాహ్నం ఎలాగూ ఆఫీసులోనే తింటున్నాను. ఇవాళ లంచ్ యింట్లో మనం వండుకుని భోం చేద్దాం" అని ఎప్పుడైనా అంటే, "సరే.." అని ఏనాడూ అనలేదు. పైగా



"సారీ..శశాంక్..రెండు బర్త్‌డేలున్నాయి. కేకులు చెయ్యాలి. ఐసింగ్ చెయ్యాలి. సాయంత్రం హోటల్ సుదర్శన్‌లో మహిళా చైతన్య సమాజం వాళ్ళకి వ్యక్తిత్వ వికాసం మీద క్లాసుంది" ఈ రెండులాంటి కారణాలు కాక పోతే, ఇంకెక్కడికో వెళ్ళాలి..వగైరా లాంటి కారణా లతో మళ్లీ బయటే తింటూంటే కూడా కోపం కానీ, విసుగుని కానీ చూపించేవాడు కాదు.

అలాంటిది ఈరోజున కోపం వచ్చి వెళ్ళిపో యాడా! అస్సలు నమ్మబుద్ధి కావడం లేదు.

ఎప్పుడైనా శశాంక్ మొహంలో నిరాశ కనిపించేది. కానీ అప్పుడేం అనలేదెందుకు?

ప్రతీ ఫంక్షన్‌కి లేటే.. ఇంతసేపా అని సున్ని తంగా అనేవాడు కానీ, కోపం ఎప్పుడూ ప్రదర్శించ లేదు.

ఆలోచిస్తున్న కొద్దీ మనిషి హిస్టీరికల్‌గా అయిపో యింది. ఏదో అన్యాయం, ఏదో ఘోరం జరిగిపోయి నట్లుగా అనిపించింది. తెలీకుండా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. 'నేనో సినిక్‌ని' అని అనుకుంది.

చెల్లెలి పురుడుకోసం కాలిఫోర్నియా వెళ్ళిన అమ్మకి ఫోన్ చేసింది.

"నీ తప్పెంతుందో ముందు నీ వైపు నుంచి చూడు. నీ బిజినెస్ నీ కెరీర్‌లో పడినప్పుడు మీ దాంపత్య జీవితంలో అపశృతులు పలికి ఉండచ్చు. కారణం ఏదైనా కానీ పరిస్థితిని విశ్లేషించుకో. జీవి తాన్ని నాగరికత ఏలుతూంటే, మల్లెపువ్వుల్లాంటి అమాయక శిరీష సౌఖ్యాలు నిద్రాణంలో ఉండిపో యాయేమో ఆలోచించు. నరాల్ని తట్టి, కొట్టి, గుంజి తేనే కానీ, చలనం కలగని పరిస్థితి మీ మధ్య వచ్చిం దేమో ఎనలైజ్ చేసుకో. నీ టాలెంట్, నీ స్వేచ్ఛ, శశాంక్‌కన్నా నువ్వే ఎక్కువ అనే భావం నీలో కలి గించి, నిన్ను ముంచేసాయేమో..తొందరపడకుండా నిదానంగా ఆలోచించు. సమయం తీసుకో..ఆ తర్వాత చూడు"

హైదరాబాద్‌లో ఉన్న అత్తగారికి ఫోన్ చేసింది.

"శశాంక్ మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాడేమో. నేను వెయిట్ చేస్తున్నానని చెప్పండి. కాల్ కోసం ఎదురు చూస్తున్నానని చెప్పండి" చాలా ఫార్మల్‌గా అంది.

కళ్యాణి, శశాంక్‌ల పెళ్ళి వాళ్ళకిష్టం లేనిది. కానీ పెద్దరికంతో ఒప్పుకున్నారు. శశాంక్‌తో కానీ, కళ్యాణితోకానీ అవసరం అయినప్పుడే మాట్లాడు తారు. ఏ విషయంలోనూ జోక్యం చేసుకోరు.

ఇప్పుడు ఆవిడ విషయం ఏమిటి? ఏం జరి గింది? అని అడగలేదు. చెప్పేందుకు కళ్యాణి కూడా సిద్ధంగా లేదు.

ఎదురుగా ఉన్న గడియారంలో టైము చూసింది. పదకొండవుతోంది.

"సారీ కళ్యాణి, నేను యింక వెయిట్ చెయ్య లేను. వెయిట్ చెయ్యడం వేస్ట్. నేను వెళ్ళిపోతు న్నాను" శశాంక్ మెసేజ్‌లోని అక్షరాలు కళ్ళ ముందు కదులుతున్నాయి. గదిలోకి వెళ్ళి డ్రెస్సింగ్ టేబుల్ మీద బాగ్ పెట్టి, అద్దంలో మొహం చూసు కుంది.

ముదురాకుపచ్చ బార్డరున్న ఎర్రటి ఛందేరీ చీర. ఎరుపు ఆకుపచ్చ పూసలతో మెడనంటి పెట్టుకున్న వెడల్పాటి ఛోకర్. మేకప్‌తో, భుజాల వరకూ ఉన్న

సెట్ చేసిన జుట్టు, ఓ షోకేసులో బొమ్మలా అనిపించింది.

క్షణం తీరిక లేకుండా ఎప్పుడూ చుట్టూరా ఓ పదిమంది ఆడవాళ్ళు ఏదో ఒకటి నేర్చుకుంటూ, సందేహాలు తీర్చుకుంటూంటే బిజీగా ఉండే తను..తనలోని స్త్రీత్వాన్ని ఓ పక్కకి తోసేసిందా! కావచ్చనిపించింది.

దాంపత్య జీవితం సాఫీగా లేకపోతే జీవితంలోని మెరుపు పోతుందని అమ్మ అంది. అదే జరిగిందా! అదే కావచ్చా కారణం!

రాత్రి రొటీన్ గుర్తుకు తెచ్చుకుంది.

భోజనం చేసి, మర్నాటి కార్యక్రమాలు డైరీ తీసి చూసుకుంటుంది.

చీరల ఆర్డర్లు చూసుకుంటుంది. కాస్సేపు టీవీలో వార్తలు చూసి, బాత్రూములోకెళ్ళి మేకప్పులోని ఒక్కొక్క పొర తీసి, వేడినీళ్ళ స్నానం చేసి, మాయిశ్చరైజర్ రాసుకుని, ఓ డెలికేట్ నైట్‌డ్రెస్ వేసుకుని గదిలోకి వచ్చేసరికి పన్నెండు దాటిపోతుంది. ఆ టైములో శశాంక్ నిద్రపోతే తన తప్పేం ఉంది?


అలసిపోయి విశ్రాంతి కోరుకునే శరీరానికి నిద్ర మందు. అందుకని శశాంక్‌ని లేపడం యిష్టం లేదు. అందులో తప్పేం ఉంది?

ఒకవేళ లేపినా, నిద్రమత్తు నుంచి మూడ్ తెచ్చుకుని, తతంగం అంతా పూర్తయ్యేసరికి విలువయిన నిద్రలో కొంచెం సమయం తగ్గిపోదా!

రాత్రుళ్ళు మంచం మీద ఎక్కువ సమయం గడపకపోవచ్చు. అంతమాత్రాన వెళ్ళిపోవాలా! అదీ యిన్ని ఏళ్ళ తర్వాత...పధ్నాలుగేళ్ళ తర్వాత.

ఆ ఆలోచనతో గుండె బరువెక్కింది. అయోమయంగా అటూ ఇటూ తిరుగుతూ, గబుక్కున దేవుడి గదిలోకి అనాలోచితంగా వెళ్ళింది.

ఏదో పండగలకి, పబ్బాలకి, దీపావళి రోజు రాత్రి చేసే లక్ష్మీపూజకి మాత్రం ఆర్భాటంగా దేవుడి పూజ చేస్తుంది. మామూలు రోజుల్లో నుంచుని, అగరొత్తులు వెలిగించి, హారతిచ్చేసి, గబగబా వెళ్ళిపోతుంది. అలాంటిది ఇవాళ కింద కూచుంది. చీర మాసిపోతుందన్న ధ్యాస లేదు. నలిగిపోతుందేమోనన్న ఆలోచన కూడా రాలేదు. భుజాల నిండా కొంగు కప్పుకుని కళ్ళు మూసుకుంది.




'దేవుడా, శశాంక్ మంచివాడు. ఇన్ని రోజులూ నా నిర్లక్ష్యాన్ని భరించి భరించి, యింక ఏమాత్రం భరించే శక్తిలేక వెళ్ళిపోయాడు. బయట తినీ తినీ విసుగ్గా వుంది. యింట్లో వంట చెయ్యి అని ఓ చిన్న పిల్లాడిలా అడిగిన శశాంక్ మొహం గుర్తొస్తోంది. నాకు చక్కగా వంట చేయడం వచ్చు. అయినా నా బిజినెస్‌లో మునిగి నేను ఏ రోజూ కూడా చేయలేదు. ఎప్పుడూ బయట నుంచి రొట్టెలు కూర తెచ్చుకోవడమే కదా! అదే కారణం అయితే..నా తప్పు ఒప్పుకుంటాను. శశాంక్‌ని యింటికి పంపించెయ్యి. ఓ మంచి భార్యగా లేను. కానీ మంచి ఫ్రెండ్స్‌లాగా ఉన్నాము.




ఏనాడూ నా మాట కాదనలేదు. అయిష్టాన్ని ఎప్పుడూ చూపించలేదు కానీ, అంతరాంతరాల్లో నన్ను వదిలి వెళ్ళేంత అయిష్టం ఉందంటే..నమ్మలేకపోతున్నాను' మనసులోనే అనుకుంది. 'లేకపోతే ఏదైనా ఎఫైర్!' కాకపోతే, లేకపోతే వెళ్ళిపోతున్నానని ఎలా అనగలుగుతాడు.

ఓ రెండు నిమిషాలు ఆలోచించింది. శశాంక్ తన కంపెనీలో పనిచేసే ఆడవాళ్ళ గురించి ఎప్పుడైనా మాట్లాడాడా! ఎవరి గురించైనా చెప్పాడా! రెండేళ్ళ క్రితం ఢిల్లీనుంచి చెన్నై వచ్చిన గీర్వాణీ ముఖర్జీ గురించి చెప్తూంటాడు. పొద్దున్న ఏడున్నరకి ఒకే కాబ్‌లో వెళ్తారు. రాత్రి ఎనిమిది, తొమ్మిది, పది, ట్రాఫిక్‌ని బట్టి యింటికొస్తారు. అంతేకాకుండా ఒకే టీం. రోజుకి తొమ్మిది గంటలు కలిసి పని చేస్తూంటారు. లాంగ్ ఎస్సోసియేషన్‌లో ఏవైనా జరుగుతాయి. ఎన్నైనా జరుగుతాయి.

కానీ గీర్వాణితో శశాంక్.. ఆ ఊహ ఆమెకే నచ్చలేదు. తన వ్యక్తిత్వానికే డిగ్రేడింగ్‌గా అనిపించింది. శశాంక్‌ని అనుమానించాల్సిన అవసరం లేదు. శశాంక్‌ని

## అంతా సృష్టే!

**అందచందాలు ఆరేయడంలో ఛార్మికి పెద్దగా మొహమాటాలు లేవని అందరికీ తెలుసు. అలాగే రాబోయే '16డేస్' అనే సినిమాలో ముద్దు సీన్లో కూడా ఛార్మి నటించింది అని ఇటీవల పబ్లిసిటీ (ఆ స్టిల్‌తో సహా) బాగానే జరిగింది. అయితే ఈ విషయమై ఛార్మి- 'నేను అసలు ముద్దు సీన్లలో నటించలేదు. నటించను కూడా. ఆ సినిమాలో ఆ సీన్‌లో నేనలా నటించనేలేదు. ఫోటోగ్రఫీ ట్రిక్ అది' అంటూ తేల్చిపారేసింది. నిజమేనంటారా? నమ్మొచ్చా? ఏమో!!**




అనుమానించడం, తనని అవమానించుకోవడమే.

తను కూడా చీరలు, డ్రెస్‌లు ఆర్డరివ్వడం కోసం ఊళ్ళు వెళ్తుంటుంది. రెండు నెలల క్రితం భుజ్ వెళ్ళి గుజరాతీ గాగ్రా, చోళీలు ఎలా కావాలో ఆర్డరిచ్చి వచ్చింది. వస్తూ వస్తూ రాజ్‌కోట సిల్కుచీరలు తెచ్చుకుంది. తను నిర్వహించే క్లాసుల్లో మగవాళ్ళు కూడా ఉంటారు. మగ క్లయింట్లుంటారు. మగ కస్టమర్స్ ఉంటారు. అయినా ఏ రోజున కూడా అనుమానించలేదు. అది తనమీద శశాంక్‌కి ఉన్న నమ్మకం. అదే నమ్మకం తనకి కూడా శశాంక్ మీద ఉండాలి. అందుకని అఫైర్ లాంటి పదం తెచ్చి శశాంక్ నీతికి, క్రమశిక్షణకి, లాయల్టీకి మచ్చ తేదల్చుకోలేదు.

ముందు గదిలోకి వచ్చింది. ఇందాక రెపరెపలాడిన కాయితం కాళ్ళకి తగిలింది.

నిరాసక్తతతో యాంత్రికంగా వొరిగింది. కాయితాన్ని చేతిలోకి తీసుకుంది.

సోఫాలో ఓ మూలకి ఆనుకుని మళ్ళీ చదవడానికి ఉపక్రమించింది. విషయం తెలిసాకా మళ్ళీ చదవడానికి భయపడింది. 'ధైర్యం తెచ్చుకో..చదువు..మళ్ళీ ఓసారి చదువు..ఇంతకు ముందు కలిగిన అభిప్రాయం మారిపోవచ్చు. ధైర్యంగా చదువు..బీ బ్రేవ్' అని తనకు తనే చెప్పుకుంది. చదవడం మొదలెట్టింది.

"డియర్ కళ్యాణీ,

నీలో యింక మార్పు రాదు. నీలోని మార్పు కోసం ఎదురు చూసి, చూసి పధ్నాలుగేళ్ళా గడిచిపోయాయి. నువ్వు మారుతావని ఎప్పటికప్పుడే అనుకునేవాడిని. ఊహూ..అలా అవలేదు. ఈ వెయిటింగ్ యింక నేను చేయలేను. వెయిట్ చేయడం వేస్ట్. నేను వెళ్తున్నాను"

ఆ సైడ్ అంతే ఉంది. నీళ్ళు నిండిన కళ్ళతోనే కాయితాన్ని వెనక్కి తిప్పింది. అక్కడ కూడా శశాంక్ ఏదో రాసాడు. గబగబా చదవడం మొదలెట్టింది.

"ఏడు గంటలకి రామన్ యింట్లో కలుసుకోవాలని అనుకున్నాం అని నీకు ముందే చెప్పాను. నువ్వు తయారయ్యి ఎంతసేపటికీ రావు. నువ్వు డ్రెస్ చేసుకోవడానికి చాలా టైము తీసుకుంటావని నాకు తెలుసు. కానీ నా ఫ్రెండ్స్‌కి తెలీదు కదా...

అప్పటికే నాలుగుసార్లు ఫోనొచ్చింది. మనం వెళ్తున్నది పిక్నిక్‌కి, పెళ్ళికి కాదు. ఓ సండే హాయిగా గడపడానికి బీచ్ రిసార్ట్స్‌కి వెళ్తున్నాం. ఓ జీన్స్ టీ షర్ట్, ఓ సన్‌స్క్రీన్ చాలు...



ఇంక ఎనిమిది దాటిపోతోంది. ఇంకా వాళ్ళని ఎదురుచూడమనటం మన నిర్లక్ష్యానికి పరాకాష్ఠ. ప్రతీసారి చాలా ఒబీడియంట్‌గా వెయిట్ చేసే నేను, నా ఫ్రెండ్స్‌ముందు తలదించుకోవడం యిష్టంలేక ఒక్కడినే వెళ్తున్నాను.

నువ్వు తయారయ్యాక ఓ టాక్సీ తీసుకుని బీచ్‌కి వచ్చెయ్యి. రాత్రికల్లా యింటికొచ్చేస్తున్నాం. వచ్చేప్పుడు బయట భోంచేద్దాం. ఎప్పటిలాగే నీ ఒబీడియెంట్ హజ్బెండ్‌లాగా అక్కడ నీకోసం వెయిట్ చేస్తుంటాను. కానీ...ఓ మామూలు పిక్నిక్ కోసం.. మూడుగంటలు డ్రెస్ చేసుకోవడానికి....నువ్వు మారాలి"

కళ్యాణి పెదవులమీద చిరునవ్వు. కళ్ళల్లోని నీళ్ళు రాలకుండా అక్కడే రెప్పల మాటున ఉండిపోయాయి.

డ్రెస్ మార్చుకుందామనుకుని గదిలోకి వెళ్ళింది. ఉలిక్కిపడి ఆ ఆలోచన మానేసింది. ఓ బాగ్‌లో ఓ జీన్స్, టీషర్ట్, టవల్, సన్‌స్క్రీన్ లోషన్ పెట్టుకుని, ఇల్లు తాళం పెట్టి టాక్సీ తీసుకుని నలభై కిలోమీటర్ల దూరంలో ఉన్న సీషోర్ రిసార్ట్స్ వైపుగా వెళ్ళింది.

○

## ఇలియానా కోపం!

సోయగాల ఇలియానా చూడ్డానికి ఎంతో ముద్దుగా వుంటుంది కదా! కానీ ఆమెకి కోపం గనక వచ్చిందే అనుకోండి, అలా ఇలా అరవదుట, గట్టిగా రంకెలేస్తుందిట. అసలు నాజూకు అందాల ఇలియానానేనా ఇలా గయ్యిమంటోంది అని అంతా ముక్కున వేలేసుకోవాల్సిందేనట. ఈ సంగతి ఇలియానా స్వయంగా ఒప్పుకుంటుంది కూడా. తనకి కోపం అంతగా ఎందుకు వస్తుందో తెలీదుట. ఎంతగా కంట్రోల్ చేసుకోడానికి ప్రయత్నించినా కుదరడం లేదట. వీలైనంత తొందర్లోనే తన కోపాన్ని అదుపు చేసుకునేందుకు ట్రై చేస్తున్నానంటోంది. ఆల్ ది బెస్ట్.